# సింగిల్ పేజి కథలు

## బహుమతి

"తాతయ్యా నీకు జల వేత్తా" చరచరా పైకి పాకుతూ పలుకుతోంది బుజ్జమ్మలు ఉరఫ్ గీత. సుడిగాలిలా పరిగెత్తుకొస్తున్నప్పుడే అనుకుంది 'ఇదేదో ఉపద్రవంగా వుంది' అని ఏమిటో అని దాన్ని అనుసరించింది తల్లి.

పేపర్ చదువుకుంటూ పేము కుర్చీలో కూర్చుని వున్న మామగారి ఒళ్ళోకి ఎక్కి అక్కడినుండి ప్రక్కనే వున్న పొడుగుటీపాయ్ మీదికి ఎక్కి కూర్చుని, మామగారి జుట్టు రెండు గుప్పిళ్ళతో పట్టుకుని..ఇదీ చేస్తున్న నిర్వాహకం.

"ఏయ్ అలా తాతయ్యమీదికి ఎక్కకూడదు. కొంచెం కూడా పెద్దవాళ్ళన్న భయం లేదు" కేకలేసింది ఇందిర. అమ్మగొంతు వినగానే బిక్క మొహం వేసుకుని ఇటు తిరగబోయింది బుజ్జమ్మలు. "ఎక్కనీమ్మా ఫర్వాలేదు, దానికి పూర్తి అధికారం వుంది తాతయ్య మీదికి ఎక్కడానికి. పైకెక్కడానికే కాదు, తల మీద కూర్చోవడానికి కూడా సంపూర్ణ అధికారం వుంది" రెండో సంవత్సరం నిండి మూడో సంవత్సరంలో అడుగుపెట్టి బూరబుగ్గలతో లక్కపిడతలాంటి నోటితో, రెండు పిలక జళ్ళతో, ముద్దులు మూటకడ్తున్న బంగారు బొమ్మలాంటి మనవరాల్ని దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టుకున్నారు మూర్తిగారు.

"ఉండుతాతయ్యా నీకు జల వేయాలి" తాతయ్య ఒళ్ళోంచి మళ్ళీ టీపాయ్ మీదికెక్కింది గీత.

"అమ్మాయ్! మేం తాతా మనవరాళ్ళం. మా పనిలో మమ్మల్ని నిమగ్నంకానీయ్ డిస్టర్బ్ చేయకు" నవ్వుతూ అన్నారు మూర్తిగారు.

ఏమీ అనలేక ఉస్సురంటూ లోపలికి వెళ్ళింది ఇందిర.

"మిస్టర్ రవీ! రేపు పోస్ట్‌కు పంపవలసిన అర్జంట్ పేపర్స్ మీకు పంపించాను. ఆ ఫైల్ ఈరోజు సాయంత్రం లోపల పూర్తి అయిపోవాలి. ఆ పేపర్స్ అన్నీ టైప్ చేసి పనిపూర్తి చేసి వెళ్ళండి- సాయంత్రం కొంచెం ఆలస్యమయినా సరే. పని పూర్తిగా ముగించాకే వెళ్ళండి" కాస్త గట్టిగానే చెప్పాడు మేనేజర్ మురళి.

సాయంత్రం ఇంటికి త్వరగా వస్తానని, సినిమాకు వెళ్దామని టికెట్స్ మీ తమ్ముడితో తెప్పించి, రెడీగా వుండమని చెప్పాడు పొద్దున్న ఆఫీసుకు బయలుదేరుతూ. సుజాత ఎంతో సంబరపడిపోయింది. ఆ రోజు సుజాత పుట్టినరోజు. బావమరిది అక్కయ్య పుట్టినరోజు బహుమతిగా చీర తీసుకొచ్చాడు. అతనూ ఈ ఊర్లోనే వుంటాడు. ఎంత వుండమన్నా రాత్రికి వుండటానికి వీలు లేదని, భార్యాపిల్లలు ఎదురు చూస్తుంటారనీ, మధ్యాహ్నం అక్కయ్య చేతి విందు భోజనం చేసి వెళ్ళిపోవాలన్నాడు.

సాయంత్రం తను సుజాత ఎంచక్కా సినిమా ఎంజాయ్ చేస్తూ.. ప్చ్! ఈ పేపర్లన్నీ పూర్తి చేసినప్పుడు మాట కదా? అయినా ఉత్సాహం తెచ్చుకుంటూ పని మొదలుపెట్టాడు. అతనికి టైపింగ్‌లో మంచి స్పీడ్ వుంది. లంచవర్‌లో కూడా బయటికి వెళ్ళకుండా, కాఫీ తెప్పించుకు తాగి పని చూసుకున్నాడు. అమ్మయ్య! అయిపోయాయి అన్ని పేపర్స్. చక చక అన్ని చక్కగా సర్దేసి ఫైల్‌లో అమర్చి, మేనేజర్ రూంలోకి వెళుతూ టైం చూసుకున్నాడు. 'మై గుడ్‌నెస్ టైం నాలుగున్నర అయింది. ఎంత అదృష్టం ఇంకా అరగంట టైం వుంది. ఇంత త్వరగా ఇన్ని కాయి



తాలు ఎలా పూర్తి చేయగలిగాను' తన శక్తికి తానే ఆశ్చర్యపోతూ రూంలోకి ప్రవేశించాడు.

పేపర్స్ అన్ని వెరిఫై చేసిన మేనేజర్ మురళి మొహంలో వెలుగొచ్చింది. చాలా చక్కగా చేశాడు. ఎంతయినా రవి మంచి ఎఫిషియంట్ స్టేనో. ఎంతో మెప్పుగా చూశాడు రవి వేపు. ఈ ఫైల్ సమయానికి పంపగలిగితే తమ కంపెనీకే తప్పకుండా ఆర్డర్స్ వస్తాయి. దానివల్ల లాభం లక్షల్లో వుంటుంది. ఈ విషయం ముందుగానే పైవాళ్ళ ద్వారా రహస్యంగా సమాచారం అందింది. ఇంత త్వరగా పేపర్స్ టైప్ చేసిన రవికి తప్పకుండా ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలి. మనసులోని మాట పైకే అనేశాడు మురళి. "వెరీ గుడ్. రవీ చాలా త్వరగా ముగించారు పని. మన కంపెనీకి చాలా లాభం రాబోతూంది. మీకు బహుమానంగా ఒక ఇంక్రిమెంట్ ఇస్తున్నాను" వెయ్యి వోల్టుల బల్బులా వెలిగింది రవి మొహం. "థాంక్స్ సార్. మెనీ మెనీ థాంక్స్" ఉద్వేగంగా అన్నాడు రవి.

* * *

"మాచమ్మా ఇవ్వాళ మధ్యాహ్నం దుప్పట్లు అవీ వుతకాలి. మధ్యాహ్నం ఇక్కడే అన్నం తిందువుగాని ఇంటికి వెళ్ళకు" అంది ఇందిర "అలాగేనమ్మా" అంది మాచమ్మ. ఏడెనిమిదేళ్ళుగా ఆ ఇంట్లో పనిచేస్తోంది మాచమ్మ. మంచి నమ్మకమైన మనిషి. తామూ అవసరాలకు తగినట్టు ఆదుకుంటున్నారు. ఆమె భర్తకు జబ్బు చేసి హాస్పిటల్‌లో వుంటే అయిన ఖర్చంతా భరించారు. చిన్న పిల్లలిద్దర్ని తమింట్లోనే పెట్టుకుని చూసుకున్నారు. ఆ కృతజ్ఞత మాచమ్మలో నిండిపోయింది. ఎవరు ఎంత ఎక్కువ ఇస్తామని ఆశ చూపినా-ఈ ఇల్లు వదలి వెళ్ళదు.

సాయంకాలం అయేసరికి దొడ్లో తీగలన్నీ బట్టలతో నిండిపోయాయి. పాపం! మామూలు బట్టలే కాక దుప్పట్లు దిండు గలేబులేకాక డోర్‌కర్టెన్లు కూడా ఉతికి పెట్టింది వద్దన్నా వినకుండా.

సాయంత్రం అన్నీ ఇస్త్రీ చేయించుకొని బల్లమీద పెట్టింది మాచమ్మ. ఇందిరకు జాలేసింది. ఎన్ని గుడ్డలు! పాపం! చకచక లోపలికెళ్ళి అల్మైరా తీసి సగం పాతబడ్డ నేత చీరలు రెండు, ఓ శిల్కుచీర తెచ్చి మాచమ్మ చేతిలోపెట్టి "ఇంద ఇవి తీసుకెళ్ళు" అంది ఇందిర. మాచమ్మ మొహం ఆనందంతో వెలిగిపోయింది.

'పెద్దమ్మగారు, చిన్నమ్మగారు ఇద్దరూ దయగల వాళ్ళే. పెద్దమ్మగారు కాశీ అన్నపూర్ణలా కడుపునింపితే, చిన్నమ్మగారు గుడ్డలకు లోటు లేకుండా ఇస్తూ వుంటుంది. అంతేకాక సంవత్సరాదికి రెండు కొత్తచీరలు కూడా ఇస్తారు. ఈ జన్మలో ఈ ఇల్లు వదలను' అనుకొంది మాచమ్మ.

* * *

"మామ్మా మామ్మా తొందరగా రా" కేకలేస్తోంది బుజ్జమ్మలు. "ఏమిటీ ఏమిటా హడావిడి?" వస్తూ అడిగారు జయమ్మగారు. వాళ్ళందరూ వరండాలో అడుగు పెట్టగానే నవ్వు ఆపుకోలేకపోయారు.

తెల్లగా వెండి తీగల్లా పండిపోయిన మూర్తిగారి జుట్టుని చిన్న ఎర్ర రిబ్బన్‌తో ముడిపెట్టింది బుజ్జమ్మలు. బుద్ధిగా కుర్చీలో కూర్చొనున్నారు మూర్తిగారు. "ఇదేమిటండీ ఈ సింగారం! మన వరాలు చేసిందా" రిబ్బన్ తీసేయబోతూ అడిగారు జయమ్మ. జయా- మామ్మా- తాతామనవరాళ్ళు ఇద్దరు ఒకేసారి కేక పెట్టారు. "తీయకు వుండనీ" అన్నారు మూర్తిగారు. "మామ్మా! తాతయ్యకు చాక్లెట్ ఇయ్యి" అంది బుజ్జమ్మలు.

"ఎందుకే" ప్రశ్నిస్తూ వచ్చింది ఇందిర.

"నేను జలేసుకుంటే చాక్లెట్ ఇస్తావుగా! మరి తాతయ్య బంగారంగా జలే సుకున్నారు. చాక్లెట్లు ఇయ్యద్దూ?" కళ్ళు తిప్పుతూ మరీ అడుగుతోంది బుజ్జమ్మలు.

సమయానికి కాయితాలు టైప్ చేసి ఇచ్చినందుకు స్టెనోకి ఇంక్రిమెంట్ ఇచ్చినట్టు భర్త ద్వారా విన్న ఇందిర, అడక్కుండానే డోర్ కర్టెన్లు కిటికీ కర్టెన్లు వుతికి ఇస్త్రీ చేయించుకొచ్చిన మాచమ్మకు చీరలిచ్చింది తను. మరి...చెప్పినమాట విని బుద్ధిగా రిబ్బన్ కట్టించుకొన్నందుకు తాతయ్యకు మాత్రం బహుమానం ఇవ్వద్దూ! నవ్వుకుంది ఇందిర.

-కొత్రా రమాశంకర్ (నెల్లూరు)